క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి



సూక్ష్మ సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రవి

మద్దికెర: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైర్లను రక్షించుకునేందుకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ రవికుమార్ అన్నారు. ఆయన గురువారం పంట పొలాలలో పర్యటించి సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చిన్న కాలువలు చేసి వాటిని తొలగించాలన్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువు, 13-0-45(పొటాషియం నైట్రేట్) ఎకరాకు ఒక కేజీ పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో పొలాన్ని అంతర కృషి చేసి 19-19-19 లేదా 2 కిలోల యూరియా చల్లాలని సూచించారు. అధిక వర్షాల వల్ల ఇనుప ధాతువు లోపిస్తే లీటర్ నీటికి 5 గ్రాముల అన్నభేది, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పుతో 15 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలన్నారు. వీఏఏలు ఆనంద్, జాకీర్ ఉన్నారు.

భూ సర్వేతో రైతులకు ప్రయోజనం

తుగ్గలి: ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని తహసీల్దార్ రవి తెలిపారు. గురువారం చెన్నంపల్లి, జీ.ఎర్రగుడిలో రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్వేతో భూములు, రికార్డుల వరకు సర్వేయర్లు పక్కాగా లెక్క కడతారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్, రోవర్, శాటిలైట్ సిస్టమ్ ద్వారా రైతుల భూములను పక్కాగా కొలిచి హద్దులు నిర్ణయించి నంబర్ రాళ్లు పాతి అప్పగిస్తారన్నారు. సర్వే వల్ల ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ మధుమతి, మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు, నాయకులు రామచంద్రారెడ్డి, జిట్టా నాగేష్ ఉన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు



అబ్బాస్ టాకీస్ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వర్షాలు కురుస్తున్నందున పట్టణంలోని డ్రైనేజీల ద్వారా సమస్యలు తలెత్తకుడా చర్యలు తీసుకొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని అబ్బాస్ టాకీస్ ప్రాంతంలో డ్రైనేజీలను పరిశీలించి అక్కడి సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. 16వ వార్డులోని వంకపై రూ.40 లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు ఇంజినీరింగ్ సిబ్బంది చేపట్టిన లెవెల్స్, సర్వే తదితర పనులను పరిశీలించి నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డు కౌన్సిలర్లు ఎంకే శివప్రసాద్, వాహిద్, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈలు మధన్ కుమార్, శరత్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల: గత వారం రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు 31.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరో మూడు రోజులు వర్ష సూచన ఉండడంతో పాత మిద్దెల్లో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. వాహనదారులు, రైతులు వంకలు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. వర్షాల కారణంగా ఆపద ఎదురైతే వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డీఈ నీరజకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. కోవిడ్‌తో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, తిమోతి, మునీంద్ర, వీరేష్, పల్లవిరాజు, కేశన్న తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామ సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితులు శ్రీరాములు, రాముడు, చంద్ర నుంచి రూ.13,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

జగనన్న సురక్షతో సులువుగా ధ్రువపత్రాలు





ఎమ్మిగనూరులో ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మల్కాపురంలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీఓ బంగారమ్మ, సర్పంచ్ దేవేంద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలోని ప్రజలందరికీ పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించి మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సేవాయజ్ఞాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 30, 31, 32, 33 వార్డుల సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు కోటకొండ నరసింహులు, కె.విశ్వనాథ్, వీరేష్‌లతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు కావాల్సిన పలు ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలశ్రీనివాసరెడ్డి, మధు, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలోని గోనెగండ్ల-2 సచివాలయం పరిధిలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి పాల్గొని దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు.

మద్దికెర: స్థానిక సచివాలయం- 4లో తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి పాల్గొని ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో ఎంపీడీఓ బంగారమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంపును ఏర్పాటు చేశారు. మొత్తం 910 దరఖాస్తులకుగాను 875 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వాటిలో కుల ధ్రువీకరణ పత్రాలు 363 మందికి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 321 మందికి, ఆర్వోఆర్ 101 మందికి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు ఇద్దరికి, రేషన్‌కార్డ్ స్ప్లిట్ సర్టిఫికెట్లు 12 మందికి, ఆధార్ ఈ-కెవైసీ 55 మందికి అందించినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ దేవేంద్రగౌడ్, ఎంపీటీసీ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవనకొండ: మండలంలో గురువారం చివరిరోజు నేలతలమర్రి గ్రామంలో ఎంపీడీఓ గౌరీదేవి బృందం, వెలమకూరు గ్రామంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ బృందం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 12,350 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ పద్మజ, జయరాం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో పారదర్శక పాలన



హొళగుందలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: సీఎం జగనన్నది వివక్ష లేని పాలన అని, కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ఆయన సొంతమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంత్రి గురువారం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామితో కలిసి హొళగుంద-1 సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపీపీ తంబాకు నూర్జహాన్, సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి ప్రజలకందించిన పథకాలు, ఇతర విషయాల గురించి ఆరా తీశారు. ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు.

నాలుగేళ్లలో రూ.34.57 కోట్లు అందజేత

అనంతరం గ్రామ ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో హొళగుందలోని నాలుగు సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.34.57 కోట్లు ప్రజలకు అందించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా తెలుసుకోవాలని సూచించారు. అలాగే నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

హొళగుంద సచివాలయం-1 పరిధిలోని బీసీ కాలనీలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. సంతమార్కెట్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, బీసీ కాలనీలో సామూహిక మరుగుదొడ్లకు రూ.10 లక్షలు, సీసీ రోడ్డుకు రూ.5 లక్షల నిధులు కేటాయిస్తున్నామని వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు వృద్ధులు జగనన్న మా పెద్ద కొడుకులా చూసుకుంటున్నారని మంత్రితో చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున, కుమారస్వామి, వెంకటేష్, శేషప్ప, పంపాపతి, దొడ్డబసప్ప, రామకృష్ణ, తహసీల్దారు హుసేన్ సాహెబ్, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, హౌసింగ్ డీఈఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల పరిశీలన



పత్తికొండ పరిసరాల్లో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఏపీఎంఐపీ జిల్లా పీడీ ఉమాదేవి

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ టమాట ప్రాసెసింగ్ యూనిట్ త్వరలో ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. ఇటీవల పత్తికొండ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఉద్యాన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా పీడీ ఉమాదేవి పత్తికొండకు వచ్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆర్‌డీఓ మోహన్‌దాసు, అధికారులతో కలిసి పత్తికొండ పరిసర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. హోసూరు రోడ్డు, కర్నూలు రోడ్డు, గుత్తి రోడ్డులో స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ చిన్న నారాయణ, ఎంపీపీ నారాయణదాసు వెంట ఉన్నారు.

నవరత్నాలతో నవశకం

కృష్ణగిరి: ప్రభుత్వం అమలుచేసిన నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవశకం వచ్చిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో ఆమె గురువారం ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు అందుతున్నాయా..లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన పథకాలను వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి నాలుగేళ్లలో రూ.లక్షకుపైగా లబ్ధి చేకూరిందన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన తమకు సంక్షేమ పథకాలు అందడం లేదని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, సీసీ రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్‌ను ఆదేశించారు. ఎంపీడీఓ విశ్వమోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, నాయకులు నవీనపాటి, హనుమంతురెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, కృష్ణమూర్తి, మల్లికార్జున, లింగప్ప, జే నాగేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనవాసి నర్సరీని అభివృద్ధి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఫారంలో ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద చేపడుతున్న నర్సరీని మరింత అభివృద్ధి చేయాలని ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవాని సూచించారు. ఆమె గురువారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం బనవాసి ఫారంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. బనవాసి ఫారం నర్సరీలో మొక్కల పెంపకానికి సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే రాళ్లదొడ్డి బ్లాక్ ప్లాంటేషన్‌లో రోజూ 5 మొక్కలు నాటాలన్నారు. మొక్కలకు నీరందించేందుకు బోరు వేయించే విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. ఏపీడీ వలిబాషా, ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ సుజాత, ఏపీఓ విజయమోహన్, ఫారం నర్సరీ టీఏ భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ దేవశంకరయ్య, ఎఫ్‌ఏలు ఉరుకుంద, భాస్కర్ ఉన్నారు.



రాళ్లదొడ్డిలోని బ్లాక్ ప్లాంటేషన్‌లో మొక్కను నాటి నీరుపోస్తున్న ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవాని

పండ్ల తోటల సాగులో రాణించాలి

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామంలో రైతులు పాటిల్ మోహన్‌రెడ్డి, శివనాగిరెడ్డి సాగు చేసిన చీని తోటను గురువారం సాయంత్రం రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ భవానీ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పండ్ల తోటల సాగు ద్వారా మంచి లాభాలు సాధించవచ్చన్నారు. చిన్న సన్నకారు రైతులు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వంద శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకుని పండ్ల తోటల సాగులో రాణించాలన్నారు. ఎంపీడీఓ గౌరీదేవి, ఏఓ నందకిషోర్, ఏపీఓ, జేఈ, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త

తుగ్గలి: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షానికి తడిసిన కరెంటు స్తంభాలను, తీగలను తగులుతున్న చెట్లు, కొమ్మలు తాకరాదన్నారు. విద్యుత్ స్తంభాలు, నివాసాల్లోని స్విచ్ బోర్డులు, లైట్లను తడిచేత్తో ముట్టుకోరాదన్నారు. ఇనుప తీగలపై దుస్తులు ఆరవేయవద్దని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్లు స్విచ్ ఆఫ్ చేసి కనెక్షన్ తొలగించాలని చెప్పారు. రైతులు పొలాల్లో విద్యుత్తు మోటార్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, నివాసాలకు వచ్చే సర్వీస్ వైర్లు, ఇతర విద్యుత్ వైర్లు ఎక్కడైనా దెబ్బతింటే స్థానిక సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

మద్దికెరలో 36.2 మి.మీ వర్షపాతం

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు 36.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు గురువారం తెలిపారు. ఎన్నో ఆశలతో విత్తనం వేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వానలు ఎంతో ఉపయోగకరంగా మారాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూరులో 10 మి.మీ వర్షం

ఆలూరు రూరల్: తుపాను ప్రభావంతో మండలంలో మంగళవారం నుంచి గురువారం వరకు 10 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వంకలు, వాగుల్లో నీరు పారింది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు వానలు జీవం పోశాయి. అధిక వర్షాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. పాత మిద్దెలు, ఇళ్లలో నివాసం ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వీఆర్వోలు దండోరా వేయించారు. నీరు ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలను దాటొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

హొళగుంద: ముద్దటమాగిలో కార్తీకశెట్టి అనే వ్యక్తికి చెందిన మట్టి మిద్దె గురువారం తెల్లవారుజామున కూలిపోయింది. ఇటీవల వర్షాలకు బాగా నానడంతో మిద్దె కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. కుటుంబసభ్యులు ఆరుబయట నిద్రించడంతో ప్రమాదం తప్పింది. మిద్దె కూలడంతో ఇంటి సామగ్రి, నిత్యవసర వస్తువులు, తిండిగింజలు మట్టి పాలయ్యాయి. సెంటు భూమి లేని తమకు పక్కా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

వెల్దుర్తిలో 65.4 మి.మీల వర్షపాతం

వెల్దుర్తి: జిల్లాలోనే అత్యధికంగా మండలంలో గురువారం నాటి వర్షపాతం 65.4 మి.మీలుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ అభిమన్యు తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వానకు 2వ వార్డులోని సువర్ణమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. రామళ్లకోట ప్రాంతంలో మిరప, పత్తి పొలాల్లో నీరు నిలిచింది. పొలాల్లో నిలిచిన నీటిని కాలువలు చేసి తొలగించాలని ఏఓ అక్బర్‌బాషా సూచిస్తున్నారు. పట్టణం నుంచి రామళ్లకోటవైపు గల వంక పారింది. వంకలో ఎదురు ఎగబాగుతున్న చేపల కొరకు యువకులు వేట సాగించడాన్ని బ్రిడ్జిపై నుంచి వందలాది మంది ఆసక్తిగా తిలకించారు.



వెల్దుర్తిలో వర్షానికి కూలిన మట్టిమిద్దె

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(హాస్పిటల్): కాలు జారి కింద పడి తలకు తీవ్ర గాయమైన ఓ వ్యక్తి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన పింజరి మహబూబ్‌బాషా(38) బుధవారం రాత్రి ఇంట్లో కింద పడటంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్ల సూచనలతో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కర్నూలు పెద్దాస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో క్యాజువాలిటీలో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కదలిక లేకపోవడంతో అక్కడే ఉన్న కొందరు సిబ్బంది చనిపోయారని భావించారు. వెంటనే సీపీఆర్ చేయడంతో పల్స్‌లో కాస్త కదలిక వచ్చింది. ఈ విషయమై చనిపోయిన వ్యక్తి మళ్లీ బతికాడని కొందరు హడావుడి చేశారు. కొన్ని టీవీ చానళ్లలోనూ స్క్రోలింగ్ వేశారు. మరోవైపు వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏఎంసీలోని ఎస్‌ఐసీయూకు తరలించారు. అక్కడ కోలుకోలేక మధ్యాహ్నం 2.55 గంటలకు మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం ముగతి అంగన్‌వాడీ కేంద్రం-4లో కార్యకర్తలతో సెక్టారు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 4 నుంచి పౌష్టికాహారం కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేయాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

హొళగుంద: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం రాత్రి ఆయన వందవాగిలి, గజ్జహళ్లి తదితర గ్రామాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పీర్ల నిమజ్జనం, ఊరేగింపును ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు, గొడవలు సృష్టించే వారిపై నిఘా ఉంచామని అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

మద్దికెర: రైతులకు ప్రధానమంత్రి సమృద్ధి కేంద్రం ద్వారా యంత్రాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగాగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 16 కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు అవసరమైన యంత్రాలను సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. నాయకులు సోమశేఖర్ గౌడ్, కాశీ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ తండా గ్రామంలో స్థానిక పోలీసులు, కోడుమూరు సెబ్ అధికారులు జరిపిన సంయుక్త దాడులలో గ్రామానికి చెందిన నాయక్ వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, సారా తరలింపునకు ఉపయోగిస్తున్న ఎక్సెల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరుపరిచి మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

హంపకు తీరనున్న నీటి కష్టాలు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నీటి ట్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఏఈ మయాంక్ అన్నారు. గురువారం నీటి ట్యాంకు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొన్నేళ్లుగా నీటి సమస్య అధికంగా ఉన్నట్లు ప్రజలు తమ దృష్టికి తెచ్చారన్నారు. నీటి ట్యాంకు ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాలూరు వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మంది విద్యుత్ శాఖలో ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా 50 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. దీంతో పనిభారం పెరిగి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కొత్త పీఆర్సీలో మేలు చేకూర్చాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ సభ

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు 16వ విడత సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంతోని, ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

ఓటరు సర్వే పర్యవేక్షించండి

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ సర్వే పకడ్బందీగా పర్యవేక్షించాలని తహసీల్దార్ నిత్యానందరాజు ఎన్నికల సూపర్‌వైజర్లను ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో ఓటరు జాబితా సవరణ సర్వే వేగవంతంగా సాగుతోందన్నారు. ఎన్నికల సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. 26, 27వ తేదీల్లో 458 ఇళ్లను సర్వే చేయగా 999 ఓటర్ల వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ఫారం-8 దరఖాస్తులు 229, ఫారం-6కు సంబంధించి 35 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంటింటా సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్‌ఐ జెర్మియ, ఎన్నికల సూపర్‌వైజర్లు ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓ-2 రఘునాథ్, వైకేపీ ఏపీఎం చిన్న వీరన్న, ఏఎస్‌ఓ సూర్య ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి జయరాం, ఎన్నికల ఆపరేటర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఆచూకీ లేని వారి ఓటుహక్కు తొలగించండి

ఆలూరు రూరల్: ఇంటింటి ఓటరు సర్వేలో పక్కా సమాచారాన్ని నమోదు చేసి తప్పులు లేని జాబితాను రూపొందించాలని నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు. వలసలు వెళ్లిన వారు, అందుబాటులోని వారి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి., ఎలాంటి సమాచారం లేని ఓటర్ల హక్కును ఫారం-7 ద్వారా రద్దు చేయాలన్నారు. ఇంటింటి విచారణకు వచ్చే బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



చుంచుఎర్రగుడిలో మౌలాలి స్వామి పీరు ఊరేగింపు



వెల్దుర్తిలో లాల్‌సా స్వామి పీరు సవారి



మొలగవల్లిలో పులి వేషధారణలో యువకుడు

ఆలూరు రూరల్: పల్లెల్లో మొహర్రం సందడి నెలకొంది. గత నాలుగు రోజు క్రితం ఆయా గ్రామాల్లోని చావిడీలలో పీర్లు కొలువుదీరాయి. బుధవారం చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని మొలగవల్లి, మనేకుర్తి గ్రామంలో భక్తులు పులి వేశం, వివిధ వేషధారణలతో రంగులు పూసుకుని సందడి చేశారు. ఏటా కుటుంబంలో ఒకరు వేషాలు వేసి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. చక్కెర తులాభారం, అగ్నిగుండం చుట్టూ తిరిగి పూలు, వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. పీర్లు కొలువైన గ్రామాల్లో నేడు పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శనివారం సాయంత్రం ఏటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. పల్లెల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దుర్తి: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలవ్యాప్తంగా గురువారం పగలు సరిగెత్తును భక్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి చిన్న సరిగెత్తులో భాగంగా పలు చావిడిలలోని పీర్లు ఆయా గ్రామాల పురవీధుల్లో సవారీ గావించి తిరిగి చావిడిలలో కొలువుదీరాయి. పగలు సరిగెత్తుకు ప్రత్యేకత కలిగిన మండల కేంద్రంలోని ముల్లగేరి పెద్దలాల్‌సా, చిన్న లాల్‌సా పీరు స్వాములు పట్టణ పురవీధుల గుండా సవారీ సాగారు. సాహుసేన్ అంటూ పలువురు చిందులేయగా, వందలాది భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి సవారీ వెంట సాగారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, హలిగేర, చిగిళి, నగరూరు, తంగరడోణ, ములుగుందం, కారుమంచి, కై రుప్పల, బనవనూరు గ్రామాల్లో గురువారం చిన్న పీర్ల సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామాల్లో పీర్లను మేళతాళాలతో ఊరేగింపు చేశారు. భక్తులు పీర్లకు అడుగడుగునా బిందెలతో నీళ్లు పోసి పూజించారు. ఆ గ్రామాల్లోని ఆలయ గుంతల వద్ద తప్పెట్ల మోతకు యువకులు చిందులు వేశారు. కళాకారులు వివిధ వేషధారణలతో ప్రజలను కడుపుబ్బా నవ్వించారు.

కృష్ణగిరి: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పగలు సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుని పీర్లను గ్రామాల్లో ఊరేగించారు. చుంచుఎర్రగుడి, చిట్యాల, కంబాలపాడు, పెనుమాడ తదితర గ్రామాల్లో పీర్లస్వాములు అగ్నిగుండాల్లో ప్రవేశించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, నేలతలమరి, గుండ్లకొండ తదితర గ్రామాల్లో చావిడిలలో పీర్ల దేవుళ్లు కొలువుదీరారు. ఉదయం ప్రజలు పీర్ల దేవుళ్లకు ప్రత్యేక ఫాతేహాల్ నిర్వహించి చక్కెర చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మొహర్రం వేడుకలకు బందోబస్తు

హాలహర్వి: మొహర్రం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా పోలీసు శాఖ బందోబస్తు చేపడుతోందని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలకు స్పెషల్ పోలీసు టీం వచ్చిందన్నారు. అల్లర్లు, గొడవలకు తావులేకుండా వేడకలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలన్నారు. పీర్లచావిడిల నిర్వాహకులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.